జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలి
- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

కామారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కామారెడ్డి, మార్చి 14: అసెంబ్లీ సమావేశాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్ వేటును ఎత్తివేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ ఆదేశాలతో జిల్లా కేంద్రంతోపాటు ఎల్లారెడ్డిలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తాలో నిర్వహించిన నిరసనతో పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నిలదీస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. ప్రజాపాలన పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను నయవంచనకు గురిచేస్తున్నదని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపీ గౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కుంభాల రవియాదవ్, బీఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు భాను ప్రసాద్, పార్టీ అధికార ప్రతినిధి బల్వంత్ రావు, గెరిగంటి లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవంత్‌ది కక్షపూరిత పాలన..

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 14: రేవంత్‌రెడ్డిది కక్షపూరిత పాలన అని బీఆర్ఎస్ ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీశ్ కుమార్ అన్నారు. పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణం వద్ద ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. గురువారం అసెంబ్లీ కార్యక్రమాల్లో స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకూ సస్పెండ్ చేయడం దారుణమన్నారు. దీనికి నిరసనగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాలు, పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు, నాయకులు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఎరుకల సాయిలు, దేవదాస్, ఇమ్రాన్, బర్కత్, బబ్లూ, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, నాగం రాజయ్య, అరవింద్‌గౌడ్, విఠల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎస్ఆర్ ఫౌండేషన్ బాధ్యులు

భిక్కనూరు, మార్చి 14: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన రాజశేఖర్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఎస్ఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. బాధిత కుటుంబ సభ్యులకు రూ.పది వేల ఆర్థిక సహాయాన్ని విండో చైర్మన్ రాజాగౌడ్ ద్వారా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యుడు సతీశ్‌రెడ్డి, మెజీషియన్ సంతోష్, సురేశ్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల సీజ్

పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

మాచారెడ్డి, మార్చి 14 : పాల్వంచ మండలంలోని బండ రామేశ్వర్‌పల్లి, ఆరెపల్లి గ్రామశివారులో వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు రెండు గ్రామాల్లో ఇసుక వేలం

పాల్వంచ మండలంలోని వాడి, మాచారెడ్డి మండలంలోని లక్ష్మీరావులపల్లి గ్రామంలో సీజ్ చేసిన ఇసుక డంప్‌నకు శనివారం వేలం నిర్వహించనున్నట్లు ఆయా మండలాల తహసీల్దార్లు లక్ష్మణ్, శ్వేత శుక్రవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. సుమారు 15రోజుల క్రితం లక్ష్మీరావులపల్లి గ్రామంలో 75 ట్రిప్పులు, వాడి గ్రామంలో 15 టిప్పుల ఇసుక సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన ఇసుకను ఆయా గ్రామాల్లో శనివారం ఉదయం 11గంటలకు వేలం వేస్తామని పేర్కొన్నారు. అవసరం ఉన్న వారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- ప్యాసింజర్ ఆటోను వెనుక నుంచి ఢీకొన్న లారీ
- టేక్రియాల్ బైపాస్ వద్ద ఘటన
- పండుగ పూట విషాదం
- మరో ఆరుగురికి గాయాలు

ప్రమాదంలో బోల్తాపడిన ఆటో, ప్రమాదానికి కారణమైన లారీ

కామారెడ్డి రూరల్, మార్చి 14: ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను లారీ ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. ఆరుగురికి గాయాలయ్యాయి. హోలీ పండుగ పూట విషాదం నింపిన ఈ ఘటన కామారెడ్డి మండలం టేక్రియాల్ బైపాస్ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పలువురు ప్రయాణికులతో ఓ ఆటో కామారెడ్డి నుంచి అడ్లూర్ ఎల్లారెడ్డికి వెళ్తున్నది. టేక్రియాల్ బైపాస్‌లోని పెట్రోల్ బంకు వద్దకు రాగానే నిజామాబాద్ వైపునకు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొన్నది. దీంతో ఆటో బోల్తాపడి, డ్రైవర్‌తో సహా ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సదాశివనగర్ మండలం కుప్పియాల్‌కు చెందిన ఆటో డ్రైవర్ అంకం నరేందర్ (50) మృతిచెందాడు. కుప్రియాల్‌కు చెందిన ముగ్గురు, అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన ఇద్దరు, మోతెకు చెందిన ఒకరికి గాయాలు కాగా వారు కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

బెల్ట్‌షాపులపై దాడులు

మాచారెడ్డి, మార్చి 14: మండలంలోని ఎల్లంపేట గ్రామంలో బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ శుక్రవారం తెలిపారు. గ్రామంలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమచారం మేరకు దాడి చేశామని చెప్పారు. వారి ఇండ్లలో నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ.తొమ్మిది వేల వరకు ఉంటుందని చెప్పారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎల్లంపేట గ్రామంలోని బెల్టుషాపుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఆదుకోవాలని వినతి

కామారెడ్డి, మార్చి 14: ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితురాలు విఠాబాయి కోరుతున్నది. బాధితురాలు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డిలోని భారత్‌రోడ్‌లో ఉండే చిన్న కసాబ్‌గల్లీకి చెందిన విఠాబాయి గోపాల్ శుక్రవారం మృతిచెందాడు. గోపాల్ అనారోగ్యానికి గురికావడంతో కొన్నేండ్లుగా అతడు మంచానికే పరిమితమయ్యాడు. అతడి వైద్యం కోసం ఆమె రూ.ఆరు లక్షల వరకు ఖర్చు చేసింది. అతడి వైద్యం కోసం అయిన బిల్లులు చెల్లించాలని కోరుతూ ఆమె ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నది. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ప్రస్తుతం ఆమె రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్పందించి సీఎంఆర్ఎఫ్ మంజూరయ్యేలా చూడాలని బాధితురాలు కోరుతున్నది.

పెండ్లి చేయాలని ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు మృతి

వినాయక్‌నగర్, మార్చి 14 : పెండ్లి చేయాలని ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బోర్గాం (పీ) గ్రామానికి చెందిన చిలుక రాజు (29) మున్సిపల్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సదరు యువకుడు తనకు పెండ్లి చేయాలని ఈనెల 11న తల్లిదండ్రులను అడిగాడు. ఇంటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, పూర్తయ్యాక చేస్తామని చెప్పడంతో వారి మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెందిన రాజు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని కుటుంబీకులు చికిత్స నిమిత్తం దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలిన గాయాలతో మరొకరు..

వినాయకనగర్‌లో ఉండే కోట్ల అనంత్ అలియాస్ చాకలి అనంత్ (52) వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. ఈనెల 6న తన ఇంట్లో గ్యాస్ స్టవ్ వెలిగించగా గ్యాస్ లీకేజీ అయ్యి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంతో అనంత్‌కు గాయాలు కాగా దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య ముత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నేడు పాఠశాలలో ల్యాబ్ ప్రారంభం

అచ్చంపేట ఉన్నత పాఠశాలలో ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న ల్యాబ్

నిజాంసాగర్, మార్చి 14 : మండలంలోని అచ్చంపేట ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 10 గంటలకు ఎఫ్ఎల్ఎన్-ఏఎక్స్ఎల్ (ఏఐ) ల్యాబ్ ప్రారంభించనున్నారు. ప్రారంభానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ రానున్నారని ఎంఈవో తిరుపతిరెడి శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి, జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్, మండల ప్రత్యేకాధికారి, ఎమ్మార్వో, ఎంపీడీవో తదితర అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

బదిలీపై వెళ్తున్న డీఎస్పీకి సన్మానం



ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులును సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 14: బదిలీపై వెళ్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులును బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయనను కలిసిన నాయకులు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. డీఎస్పీగా పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొనడంలో ప్రధానపాత్ర వహించాడని, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీశ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు ఏగుల నర్సింహులు, నాగం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

18న సేవాలాల్ జయంతి వేడుకలు

లింగంపేట, మార్చి 14: మండల కేంద్రంలో ఈ నెల 18న తమ ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతిని నిర్వహించనున్నట్లు బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు గన్నూనాయక్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిరిజన నాయకులు మాట్లాడారు. వేడుకలకు ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాల గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గిరిజన నాయకులు లింబేశ్ నాయక్, వచ్యానాయక్, పరుశురాం, వినోద్, ప్రకాశ్, దశరథ్, పూల్‌సింగ్, మోతీరాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన హోలీ సంబురాలు

ఎల్లారెడ్డి పట్టణంలో హోలీ ఆడుతున్న చిన్నారులు

గోలిలింగాల గ్రామంలో హోలీ ఆడుతున్న చిన్నారులు

చిన్న మల్లారెడ్డి శివారులో మట్టి స్నానం చేస్తున్న యోగా సాధకులు

బోర్లం క్యాంపు తండా గ్రామంలో రంగులు పూసుకుంటున్న గిరిజన మహిళలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 14: జిల్లావ్యాప్తంగా ప్రజలు హోలీ పండుగను సంతోషంగా జరుపుకున్నారు. పండుగ సంబురాలు అంబరాన్ని అంటాయి. గురువారం రాత్రి కామదహనం నిర్వహించారు. శుక్రవారం చిన్నా పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సరదాగా గడిపారు. డప్పు చప్పుళ్లు, డీజే సౌండ్స్ ప్రధాన వీధుల్లో మార్మోగాయి. పలు గ్రామాల్లో కోలాటం ఆడారు. కామారెడ్డి మండలంలోని చిన్న మల్లారెడ్డి శివారులో ఉన్న మోటూరి కృష్ణమూర్తి వ్యవసాయ క్షేత్రం వద్ద జై హనుమాన్ యోగా కేంద్రం ఆధ్వర్యంలో మట్టి స్నానం, యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా యోగాచార్యుడు గరపల్లి అంజయ్యగుప్తా మాట్లాడుతూ.. ఔషధ మూలికలు, ఆవు పేడ, ఆవు మూత్రం, పుట్ట మన్ను తదితర 35 రకాల మిశ్రమాలతో తయారుచేసిన మట్టిని శరీరానికి పట్టించి, అర గంట అనంతరం స్నానం చేస్తే సహజసిద్ధమైన చర్మ కాంతి, ఆరోగ్యం లభిస్తాయని అన్నారు. యోగా సాధకులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బోర్లం క్యాంపు తండాలో గిరిజన మహిళలు నృత్యాలు చేస్తూ గ్రామంలో భారీ ర్యాలీని నిర్వహించారు. బీర్కూర్‌లో 50 కేజీల గుండును ఎత్తు కోవడానికి పోటీ పడ్డారు. దోమకొండ మండలంలో మాజీ ప్రజా ప్రతినిధులు, యువకులు హోలీ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో హోలీని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు పండుగను నిర్వహించారు. మద్నూర్ మండలంలో హోలీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి గ్రామంలో చిన్న, పెద్ద తేడాలేకుండా ప్రజలు పండుగ చేసుకున్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో హోలీ పర్వదినాన్ని మండల ప్రజలు జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారులు, పెద్దలు, మహిళలు రంగులను పూసుకుని పండుగ చేసుకున్నారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో రెండో రోజూ హోలీ సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసు సిబ్బంది పండుగ జరుపుకున్నారు. గ్రామాల్లో రంగుల పండుగను ఘనంగా నిర్వహించారు. రామారెడ్డి మండల కేంద్రంలో యువకులు ప్రధానవీధుల గుండా తిరుగుతూ రంగులు చల్లుకుంటూ డీజే చప్పుల్లతో నృత్యాలు చేస్తూ పండుగ జరుపుకున్నారు.

మూల మలుపు .. ప్రమాదాలకు పిలుపు

- మలుపుల వద్ద సూచిక బోర్డులు కరువు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు

కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మూల మలుపుల వద్ద కనిపించని సూచిక బోర్డులు

లింగంపేట, మార్చి14: మండల పరిధిలోని కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న మూల మలుపులు ప్రమాదాలకు నెలవుగా మారాయి. ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి మీదుగా మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు వెళ్లడానికి ఈ రోడ్డు ప్రధాన రహదారిగా ఉన్నది. ఈ దారి గుండా బీదర్, నాందేడ్ తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. మండల పరిధిలో సుమారు 30 కిలో మీటర్ల వరకూ 50కి పైగా మూల మలుపులు ఉన్నాయి. లింగంపేట నుంచి ఎల్లారెడ్డి వరకు 17 కిలోమీటర్ల పరిధిలో 30 వరకూ మూల మలుపులు ఉన్నాయి. వీటిలో 10 వరకు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు సంభవించాయి. ప్రమాదాల కారణంగా పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. కామారెడ్డి రహదారిపై లింగంపల్లి, ముస్తాపూర్, గాంధీనగర్ గ్రామాల సమీపంలో ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి. అలాగే ఎల్లారెడ్డి రహదారిపై మెంగారం గ్రామ శివారు, మిద్దెమెట్టు, కొట్టాల్ గ్రామ సమీపంలో మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎల్లారెడ్డి రహదారిపై ఇరువైపులా అటవీ ప్రాంతం ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనం కనిపించని రీతిలో మూల మలుపులు ఉన్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పోవడంతో ఎదురెదురుగా వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదకరంగా ఉన్న మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం..

కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. గతంలో ఏర్పాటు చేసిన బోర్డులు గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. మూల మలుపుల వద్ద బోర్డుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాం. 15 బోర్డులు మంజూరయ్యాయి. అత్యంత ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద ముందుగా బోర్డులు ఏర్పాటు చేసి, రెండో విడుతలో మిగిలిన ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారిస్తాం.

-రవితేజ, ఆర్అండ్‌బీ ఏఈ

పాఠశాలకు ప్రహరీ లేక ఇబ్బందులు

- పాఠశాల ముందునుంచే రాకపోకలు సాగిస్తున్న స్థానికులు
- ఇబ్బంది ఎదుర్కొంటున్న విద్యార్థులు

నాగిరెడ్డిపేట, మార్చి 14: ధర్మారెడ్డి ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రహరీ లేకపోవడంతో స్థానికులు పాఠశాల ముందునుంచే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో విద్యార్థుల చదువుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఆటలు ఆడే సమయంలో సైతం పశువులు వచ్చి వెళ్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించి తమ ఇబ్బందులు తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రహరీ లేని ఉన్న ధర్మారెడ్డి ప్రాథమిక పాఠశాల